


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 340, పేజీలు - 08

ఆదివారం, మే 4, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




# యాక్షన్..బిగిన్

## - రేవంత్ మళ్లీ వార్నింగ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గాయం ఎక్కడ ఉందో అక్కడే మందు వేయాలి. లేదంటే శరీరం మొత్తం పాకుతుంది. గాయం తగిలిన ప్రాంతం సెప్టిక్ కాకుండా ఇంజక్షన్ కూడా చేయించాలి. లేదంటే ఏకంగా గాయమయిన చేతినే తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది వైద్య పరిభాష అయినప్పటికీ తెలంగాణ కాంగ్రెస్ కు ఇది అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా, ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేస్తున్నా, డ్యామేజీ అయ్యేది ఎమ్మెల్యేల వల్లనే. ఎందుకంటే నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో లేకుండా ఎమ్మెల్యేలు ఉంటే మాత్రం చివరకు ఎన్నికలకు వచ్చే సరికి పార్టీ అధికారంలోకి దూరమయ్యే అవకాశముంది. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

### కాంగ్రెస్ ను బలోపేతం చేయడంపై..

అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేయడంపై ఫోకస్ పెట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఒకవైపు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూనే మరొక వైపు ఎమ్మెల్యేలను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ఎమ్మెల్యేల పనితీరుపై ఆయన నియోజకవర్గాల వారీగా సమీక్షలు ప్రారంభించారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తిరగాల్సిందేనని సీఎల్పీ సమావేశంలో గట్టిగా హెచ్చరించిన రేవంత్ రెడ్డి వారు హైదరాబాద్ లో ఉండటాన్ని గుర్తించి వారితో సమావేశమై నియోజకవర్గాల సమస్య గురించి తెలుసుకుంటున్నారు. వాటిని పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దీనివల్ల ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిరగడం ప్రారంభమైతే రెండేళ్లలో పార్టీ పుంజుకునే అవకాశముంటుందని భావిస్తున్నారు.

### సొంత జిల్లా ఎమ్మెల్యేలతో..

ముందుగా మహబూబ్ నగర్ జిల్లాతోనే ఆయన నియోజకవర్గాల ఎమ్మెల్యేల సమీక్షను ప్రారంభించారు. సొంత జిల్లా మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గాలలో జరిగిన అభివృద్ధిపై రేవంత్ రెడ్డి ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును గురించి కూడా కూపీ లాగారు. ఎక్కడెక్కడ తిరిగారు.? ఎన్ని సమావేశాలు నిర్వహించారు.? అన్నది కూడా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గాల సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారా.? లేనిదీ తెలుసుకున్నారు. నియోజకవర్గానికి నిధుల రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చాయని, వాటిని ఏ ఏ పనులకు ఖర్చు చేశారంటూ ఎమ్మెల్యేలను సూటిగా ప్రశ్నిస్తున్నారు.

2లో..

ఉగ్రవాదులు, వారి మద్దతుదారులపై

# కఠిన చర్యలు

## - పహల్గామ్ దాడిపై మోదీ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ఉగ్రవాదంపైన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదుల పైన, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామంటూ స్పష్టం చేశారు. తాజాగా ఆయన అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కోతో భేటీలో పాల్గొన్నారు.

2లో..

# ఇక అంతా మీ చేతుల్లో ఉంది

## - మంత్రి నారాయణతో సీఎం చంద్రబాబు

- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- మోదీ మద్దతు, వ్యాఖ్యలతో రాష్ట్రానికి భరోసా లభించిందన్న సీఎం
- మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి నారాయణకు నిర్దేశం



2లో..

నిజమైన పేదలకే

# ఇందిరమ్మ ఇల్లు

- తప్పు జరిగితే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వొద్దని ఇంజనీర్లకు మంత్రి సూచన
- చిన్న ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరిక

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం ఇల్లు కట్టించాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు గృహ నిర్మాణాలను చేపట్టింది. అర్హులైన వారికి ఈ పథకం వర్తించాలని భావించి సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇక ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి శరవేగంగా పనులు జరిగేలా చూస్తోంది. ఇక ఈ క్రమంలోనే తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం పైన రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పథకం నిజమైన అర్హులకు



మాత్రమే వర్తించాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అందుకే లబ్ధిదారుల ఎంపిక నేరుగా వారి వద్దకే వెళ్లి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎక్కడ ఎటువంటి తప్పు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్ లది అని మంత్రి పొంగులేటి

2లో..

# 42సార్లు ఢిల్లీ వెళ్లి చేసిందేంటి.?

## - సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం ఉపాధి పనిదినాల్లో రాష్ట్ర కోటాను సగానికిపైగా తగ్గించిందని, ముఖ్యమంత్రి 42 సార్లు ఢిల్లీకి వెళ్లి చేసిందేంటి

2లో..

# మూడేళ్లలో అమరావతి నిర్మాణం సాధ్యమేనా.?

## - కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందా.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులు ప్రారంభం కావడంతో దేశం దృష్టి ఒక్కసారిగా అటు పడింది. రాష్ట్ర విభజన జరిగి దాదాపు 11 ఏళ్లు గడుస్తోన్నా రాజధాని లేదనే వెలితి ఏపీ ప్రజలను వెంటాడుతూనే ఉంది. అయితే ఆ వెలితిని పూర్తి చేయడానికి చంద్రబాబు సర్కారు కీలక అడుగు వేసింది. ఇకపై వెనక్కి తగ్గేదేలే అన్నట్లు అమరావతి నిర్మాణంలో వేగాన్ని పెంచింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన సందర్భంగా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లలో రాజధానిని నిర్మించి తీరుతామని తెలిపారు. ప్రధాని మోదీ సైతం తనవంతు సాయం చేస్తానని స్పష్టం చేశారు. చంద్రబాబుపై తనకు పూర్తి నమ్మకం ఉందని మూడేళ్లలో అమరావతి నిర్మించి తీరుతారని చెరాజధాని నిర్మాణానికి సంబంధించి అన్ని పనులూ ఏకకాలంలో చేపట్టేలా రూ.77,250 కోట్లతో అంచనాలు సిద్ధం చేసింది కూటమి ప్రభుత్వం. రూ.49,000 కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది. ఇక శు క్రవారం మోదీ సైతం పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇదిలా ఉంటే అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం శుక్రవారం కీలక ఒప్పందం చేసుకుంది. ఐబీఎమ్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలతో చంద్రబాబు ఎంఓయు కుదుర్చుకున్నారు. 2026 జనవరి నాటికి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇదిలా ఉంటే భారీ అంచనాలు, భారీ ప్రకటనలతో నిర్మించ తలపెట్టిన అమరావతి నగరం మూడేళ్లలో పూర్తి అవుతుందని కూటమి ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోన్న తరుణంలో కొన్ని నెగిటివ్ వాదనలు సైతం వినిపిస్తున్నాయి. మూడేళ్లలో రాజధాని నిర్మాణం అసాధ్యమంటూ కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే నిజంగానే మూడేళ్ల సమయంలో ఒక నగరాన్ని నిర్మించడం సాధ్యమేనా.? అసలు చరిత్ర ఏం చెబుతోంది.? గతంలో తక్కువ వ్యవధిలో ఏవైనా నగరాలు నిర్మాణం జరుపుకున్నాయా.? లాంటి వివరాల్లోకి వెళ్తే..

### - బ్రసీలియా నగరం 3.5 ఏళ్లలో పూర్తయింది

బ్రసీలియా బ్రెజిల్ దేశ రాజధాని నగరం. ఇది అత్యాధునిక ప్లానింగ్‌తో నిర్మించిన నగరంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ నగర నిర్మాణం 1956లో మొదలు కాగా కేవలం 41 నెలలలో అంటే 3.5 ఏళ్లలో పూర్తయింది.

2లో..

సింధు జలాల మళ్లింపును తమపై

# దాడిగానే పరిగణిస్తాం

## - భారత్ నిర్మాణాలు చేపడితే ధ్వంసం చేస్తామని హెచ్చరిక



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. సింధూ నదీ జలాలను

2లో..

# త్వరలోనే సమస్యలకు పరిష్కారం

## - ఉద్యోగులకు సీఎం భట్టి కీలక హామీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ఉద్యోగులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీపి కబురు చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఖమ్మం జిల్లా క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన అధికారంలో ఉన్నా లేకపోయినా ఉద్యోగులు, ప్రజలే తమకు స్థిరమైన బలమన్నారు. తమ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగుల సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అంకిత భావంతో పని చేస్తున్నామని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, కానీ ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం మాత్రం శాశ్వతమని మల్లు భట్టి స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలు ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంపైనా,

2లో..



హైదరాబాద్-విజయవాడ

# 6 లైన్ల రహదారి

- గత పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు రెట్టింపు
- 2,500 కి.మీ నుంచి 5,200 కి.మీకి పెరిగిన జాతీయ రహదారులు
- రహదారుల అనుసంధానానికి మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- హైదరాబాద్-శ్రీశైలం, విజయవాడ మార్గాల విస్తరణకు ప్రణాళికలు



2లో..

# రైతుల కష్టాలు పట్టవా?

## - ప్రభుత్వంపై జగన్ ఫైర్



- ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసుకోవడం లేదని విమర్శ
- మీరు కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా అని వ్యాఖ్య
- మిర్చి కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేసిందంటూ ఆగ్రహం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారి గోడును పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా, ప్రభుత్వ యంత్రాంగం కనీసం స్పందించకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబును ఉద్దేశించి ట్వీట్ చేశారు. "చంద్రబాబు కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా వారి గోడు పట్టించుకోవడం లేదు. కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులూ

2లో..

# పహల్గాం దాడిపై ఎన్ఐఏ రిపోర్ట్

## - త్వరలోనే కేంద్రానికి అందజేత

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జమ్ముకశ్మీర్లో ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తన ప్రాథమిక నివేదికను అతి త్వరలోనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించడానికి సన్నాహాలు చేస్తోందని అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్లోని అత్యంత సుందరమైన పర్యాటక ప్రదేశాల్లో ఒకటైన పహల్గాంను

2లో..

# ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా మైక్రోసాఫ్ట్

## - ఆపిల్‌ను వెనక్కినెట్టిన మైక్రోసాఫ్ట్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) టెక్నాలజీ ప్రపంచంలో సుదీర్ఘ కాలంగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆపిల్‌ను వెనక్కి నెట్టి, సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలలో కనబరుస్తున్న అసాధారణ వృద్ధి మైక్రోసాఫ్ట్‌కు ఈ ఘనతను సాధించిపెట్టింది.




2లో..

## యాక్షన్..బిగిన్ కలుపుకుని వెళ్లడంపై..

అంతేకాకుండా నియోజకవర్గాల్లో పార్టీలో అందరినీ కలుపుకుని వెళుతున్నారా? లేదా? అన్నది కూడా రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ఎమ్మెల్యేలను సూటిగానే ప్రశ్నించినట్లు తెలిసింది. అందరినీ కలుపుకుని వెళితేనే మరోసారి విజయం లభిస్తుందని, అలాగే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటే తప్ప ప్రజలు మరోసారి దీవించరని కూడా కాస్త కటువుగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పాదయాత్రలు కూడా ఎక్కడకక్కడ నియోజకవర్గాల్లో చేపట్టి సమస్యలను గుర్తించి, ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని కూడా ఆదేశించారు. ఎమ్మెల్యేలకు తాను ఏం కావాలన్నా చేస్తానని, నిధుల విషయంలో ఆలోచన పెట్టుకోవద్దని, తనను నేరుగా కలిసి చెబితే వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్ బిల్లులు కూడా క్లియర్ చేస్తామని చెప్పి ఎమ్మెల్యేలు ఇకపై నియోజకవర్గాలకే పరిమితం కావాలని, ఈ రెండేళ్లు కీలకమని రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. వరసగా జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశమవుతారని తెలిసింది. సో ఎక్కడ వీక్ గా పార్టీ ఉందో గుర్తించి అక్కడ రేవంత్ సెట్ రైట్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లే కనపడుతుంది.

## ఉగ్రవాదులు, వారి మద్దతుదారులపై కఠిన చర్యలు

అనంతరం ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లో పర్యాటకులపైన ఉగ్రవాదులు జరిపిన మారణకాండను దేశం ఇంకా మరిచిపోలేదు. ఉగ్ర మూకల కాల్పులలో మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22వ తేదీన జరిగిన ఈ దారుణ ఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన చర్చకు దారితీసింది ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ వంటి దేశాలకు బుద్ధి చెప్పే ప్రయత్నాన్ని మొదలు పెట్టింది. పాకిస్తాన్ పైన కఠినమైన చర్యలకు ఉపక్రమించిన భారత్ ఇప్పటికే అనేక కీలక నిర్ణయాలను తీసుకుంది. యుద్ధభేరి మోగించింది. ఇప్పటికే పాకిస్తాన్ భారత్ సరిహద్దుల వద్ద యుద్ధ వాతావరణం చోటు చేసుకుంది. ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్ర దాడిని చాలా సీరియస్ గా తీసుకున్నారు. దీనికి సమాధానం చెప్పి తీరాల్సిందేనని ఫిక్స్ అయ్యారు. ఈ క్రమంలోనే టెర్రరిజం పైన ఉక్కు పాదం మోపడానికి మోదీ రంగంలోకి దిగారు. భారత్ కి మద్దతుగా అనేక దేశాలు ముందుకు వస్తున్న పరిస్థితి ఉంది. తాజాగా అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కో ప్రధాని మోదీని కలిసి మాట్లాడారు. ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్లో ప్రధాని నరేంద్ర మోడీ మరోమారు టెర్రరిజం పైన విరుచుకుపడ్డారు. మానవాళి మనుగడకు టెర్రరిజం చాలా ప్రమాదకారిగా మారిందని, భారత్ తో పాటు అంగోలా కూడా నమ్ముతుంది అన్నారు. టెర్రరిస్టుల పైన టెర్రరిజాన్ని సపోర్ట్ చేస్తున్న వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని దృఢ నిశ్చయంతో తాము ఉన్నామని స్పష్టం చేశారు. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంలో మాకు సహకరిస్తున్న అంగోలా కు కృతజ్ఞతలు అంటూ, అంగోలా మద్దతు భారత్ కు లభిస్తున్న విషయాన్ని వెల్లడించారు. ఇదే సమయంలో 40 సంవత్సరాలుగా రెండు దేశాలు భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంగోలా స్వాతంత్రం కోసం పోరాటం చేస్తున్నప్పుడు ఇండియా నమ్మకంతోనూ, స్నేహంతో ను అండగా నిలిచిందని, ఆఫ్రికన్ దేశాల నుంచి గత పది సంవత్సరాలు తమకు ఎంతో సహకారం అందిందని, తమ వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచామని, ఎనిమిది దేశాలలో ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లను ప్రారంభించామని పేర్కొన్నారు. ఓ ఐదు దేశాలలో డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో కూడా సహకరిస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## నిజమైన పేదలకే ఇందిరమ్మ ఇల్లు

శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.న్యాక్ లో శిక్షణ పూర్తి చేసుకున్న 390 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు రిజిస్ట్రేషన్ శాఖలో పదోన్నతి లభించగా, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆయన రిజిస్ట్రేషన్ శాఖలో పదోన్నతి పొందిన ఇంజనీర్లు గృహనిర్మాణశాఖ కు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో తప్పు జరిగింది అని తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ మేరకు త్వరలో ఒక టోల్ ఫ్రీ నెంబర్ ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎక్కడైనా తప్పు జరిగినట్టు తెలిస్తే ఎవరైనా సరే తక్షణం ఆ టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం నిరుపేదలకు అందించే ఏ పథకం అయినా పారదర్శకంగా అమలు జరగాలని చూస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## 42సార్లు ఢిల్లీ వెళ్లి చేసిందేంటి.?

అని హరీశ్‌రావు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విమర్శించారు. "2024-25లో తెలంగాణకు ఉపాధి హామీ పనిదినాలను 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించింది. ముఖ్యమంత్రి ఢిల్లీకి 42 సార్లు వెళ్లినా ఉపాధి హామీ పనిదినాలు సగానికి తగ్గాయి. విషయం తెలిసినా రాష్ట్రంలోని 8 మంది కాంగ్రెస్ ఎంపీలతో పాటు 8 మంది బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనిదినాలను పెంచాలని, బకాయిలను చెల్లించాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## ఇక అంతా మీ చేతుల్లో ఉంది

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అమరావతి ఆవశ్యకతను చాటిచెప్పేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పనులను పునఃప్రారంభించినట్లు సీఎం స్పష్టం చేశారు. మూడేళ్లలో అమరావతిలో నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా జరపాలని సూచించారు. ఇక అంతా మీ చేతుల్లోనే ఉందంటూ మంత్రి నారాయణకు సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని నిర్దేశించారు. "అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమం విజయవంతమైంది. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే ప్రధాని చేతుల మీదుగా పనులు పున:ప్రారంభించాం. అమరావతి ఒక నగరం కాదు ఒక శక్తిగా మారుతుందన్న ప్రధాని మాటలు స్ఫూర్తిని నింపాయి. రాష్ట్ర వృద్ధి రేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ప్రధాని చేసిన వ్యాఖ్యలు భవిష్యత్ రాజధానిని ఆవిష్కరించాయి. అమరావతిలో జరిగిన సభతో అమరావతి రాజధానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. దేశానికి అమరావతి రోల్ మోడల్‌గా రూపొందుతుందని ప్రధాని అనడం రాష్ట్రానికి గర్వ కారణం. ప్రధాని మోదీ ప్రసంగం ప్రజల పట్ల ఉన్న అభిమానానికి, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచింది. మంత్రులు, నేతలకు అప్పగించిన పనులను బాధ్యతగా వ్యవహరించి బ్రహ్మాండంగా పని చేశారు. లక్షల మంది ప్రజలు పోటెత్తినా ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. అన్ని ప్రాంతాల ప్రజల భాగస్వామ్యంతో ఉత్సాహంగా, పాజిటివ్ దృక్పథంతో కార్యక్రమం జరిగింది. సభ నిర్వహణకు సమస్త ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పని చేసింది" అని చంద్రబాబు అభినందించారు. మంత్రులు స్పందిస్తూ.. రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమంపై అన్ని వర్గాల ప్రజల్లో సానుకూలత వ్యక్తమైందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రులు పార్థసారధి, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, నారాయణ సీఎంతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## రైతుల కష్టాలు పట్టవా?

రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. మీరు, మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా?మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని, పొగాకు ఇలా ఏ పంట చూసినా కనీస మద్దతు ధరలు రావడం లేదు. చొరవ చూపి, మార్కెట్లో జోక్యం చేసుకోవాలన్న కనీస బాధ్యతను విస్మరించారు. పైగా డ్రామాలతో ఆ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? మిర్చి విషయంలో కూడా మీరు రైతులను నమ్మించి మోసం చేశారు. మిర్చి కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా, నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారు. క్వింటాలు రూ.11,781కు కొంటామని చెప్పి, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా, ఒక్క రైతు నుంచి కాని, ఒక్క ఎకరాకు సంబంధించి కాని, ఒక్క క్వింటాల్ గాని కొనకుండా అన్నం పెట్టే రైతులకు సున్నం రాశారు. మా హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3 వేల కోట్లు పెట్టి, ఐదేళ్లలో రూ.7, 796 కోట్లు ఖర్చుచేశాం. చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని కనీస మద్దతు ధరల జాబితాలో లేని పొగాకు సహా అనేక పంటల రైతులను ఆదుకున్నాం. మీరు కొత్తగా ఏమీ చేయకపోయినా, కనీసం మా విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేది కదా? పైగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించడం దారుణం కాదా? ఇందులో కూడా కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు ఉన్నాయా? ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారు. జనాభాలో 60శాతం మంది ప్రజలు ఆధారపడే వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల అది తీవ్ర సంక్షోభానికి దారితీస్తే, లక్షల మంది ఉపాధికి గండిపడితే దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? వెంటనే ప్రభుత్వం తరఫున మార్కెట్లో జోక్యం చేసుకోవాలని, కనీస ధరలు లభించని పంటల విషయంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను" అంటూ జగన్ స్పష్టం చేశారు.

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం సాధ్యమేనా.?

ఏప్రిల్ 21, 1960 నాటికి రాజధానిగా అందుబాటులోకి వచ్చింది. బ్రెజిల్ దేశ అభివృద్ధిని ఆగ్నేయ తీరప్రాంతం నుంచి దేశ మధ్యభాగానికి విస్తరించే ఉద్దేశంతో ఈ నగరాన్ని నిర్మించారు. బ్రసీలియా నగర ఆకృతి ఒక విమానం ఆకారంలో ఉంటుంది. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ నగరంగా 1987లో గుర్తించింది.

**- నైపిడా (మయన్మార్):**

మయన్మార్ రాజధానిగా నైపిడాను నవంబర్ 6, 2005లో ప్రకటించారు. ఈ నగర నిర్మాణం 2002లో మొదలైంది. అంటే కేవలం మూడేళ్లలో పూర్తయింది. మయన్మార్ రాజధానిని వాయవ్య ప్రాంతంలోని యాంగోన్ నుంచి దేశ మధ్యభాగానికి తరలించాలనే ఉద్దేశంతో ఈ నగరాన్ని నిర్మించారు "నైపిడా అంటే "రాజధాని స్థలం" లేదా "రాజధాని నివాస స్థలం అని అర్థం. ఈ నగరాన్ని పరిపాలన జోన్, రెసిడెన్షియల్ జోన్, మిలటరీ జోన్, హోటళ్ల జోన్‌లుగా విభజించారు. ప్రపంచంలో అత్యధిక విస్తీర్ణం కలిగిన రాజధానుల్లో ఇదీ ఒకటి. నగరంలోని రోడ్లు చాలా వెడల్పుగా ఉండేలా నిర్మించారు. అయితే ఈ నగరంలో జనాభా ఆశించిన స్థాయిలో లేదని చెప్పాలి. ప్రభుత్వ కార్యాలయాలు, పార్లమెంటు భవనం వంటి వాటిని పూర్తిగా నైపిడాకు తరలించారు.

**- పుత్రజయా (మలేషియా)**

మలేషియాలోని పుత్రజయా నగరాన్ని పరిపాలనా కేంద్రంగా నిర్మించారు. కౌలాలంపూర్‌కు ప్రత్యామ్నాయంగా ఈ నగరాన్ని నిర్మించారు, కానీ రాజధాని హోదా మాత్రం కౌలాలంపూర్‌దే కొనసాగుతోంది. ఈ నగర నిర్మాణాన్ని 1995లో మొదలు పెట్టగా మొదటి దశ 1999లో పూర్తయింది. మొదట ప్రభుత్వ కార్యాలయాలను తరలించారు. మలేషియాలోని ప్రధాన నగరమైన కౌలాలంపూర్ పట్టణ భారం తగ్గించడానికి, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక నగరంలో సమీకరించేందుకు ఈ నగరాన్ని అభివృద్ధి చేశారు. దీనిని గ్రీన్ సిటీగా నిర్మించారు. నగరంలో 70% వరకు పచ్చదనం, పార్కులు, సరస్సులు ఉన్నాయి. ఈ నగరం పూర్తిగా అభివృద్ధి చెందడానికి 10%-%15 ఏళ్లు పట్టింది.

### సింధు జలాల మళ్లింపును

## తమపై దాడిగానే పరిగణిస్తాం

భారత్ మళ్లించేందుకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని ధ్వంసం చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ హెచ్చరించారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ వాటా నీటిని మళ్లించేందుకు భారత్ చేసే ఏ ప్రయత్నమైనా తమ దేశంపై దాడిగా పరిగణిస్తామని ఆయన అన్నారు. "ఒకవేళ భారత్ అలాంటి నిర్మాణ ప్రయత్నం చేస్తే, పాకిస్థాన్ ఆ నిర్మాణాన్ని నాశనం చేస్తుంది" అని ఆసిఫ్ పేర్కొన్నారు.

ఇటీవల పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ దాడి తర్వాత, దశాబ్దాల నాటి సింధూ జలాల ఒప్పందం అమలును భారత్ పక్కన పెట్టే ఆలోచనలో ఉంది. భారత్ ఒకవేళ ఒప్పందాన్ని నిలిపివేస్తే, అది పాకిస్థాన్ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, దీర్ఘకాలికంగా నష్టం వాటిల్లుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ మాట్లాడుతూ, ఇలాంటి బెదిరింపులు పాకిస్థానీయులలో ఉన్న భయాన్ని సూచిస్తున్నాయని అన్నారు. "ఖ్వాజా ఆసిఫ్ భయంతో వణికిపోతున్నారు. ఆయన పాకిస్థాన్ రక్షణ మంత్రి అయినప్పటికీ, నియంత్రణ ఆయన చేతుల్లో లేదు. ఆయన కేవలం 'ప్రకటనల మంత్రి', నిరంతరం బెదిరింపులు చేస్తున్నారు. పాకిస్థానీయుల భయం స్పష్టంగా కనిపిస్తోంది. వారికి రాత్రుళ్లు నిద్ర పట్టడంలేదు" అని అన్నారు. సింధూ జలాల ఒప్పందంపై పాకిస్థాన్ నేతలు గతంలో కూడా పలు సందర్భాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ గతంలో మాట్లాడుతూ, సింధూ నదిలో నీరు పారకపోతే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది, దాని నాగరికతకు తామే నిజమైన సంరక్షకులమని ఆయన పేర్కొన్నారు.

## త్వరలోనే సమస్యలకు పరిష్కారం

ఉద్యోగుల సంక్షేమంపైనా దృష్టి సారించబడ్డాయని అన్నారు. గత పాలకులు తీసుకున్న కొన్ని ఆర్థిక నిర్ణయాల వల్ల రాష్ట్ర ఖజానా ఒత్తిడిలో పడిందని, దాని ప్రభావం కొన్ని సమస్యల పరిష్కారంలో జాప్యం కలిగించిందని ఆయన అన్నారు. అయినప్పటికీ, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో నిష్టతో పని చేస్తోందని తెలిపారు. ఇక కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన కుల గణన అంశంపై స్పందించిన భట్టి విక్రమార్క తెలంగాణ ఈ విషయంలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కుల గణన సర్వే బీసీ కులాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించేందుకు దోహదపడిందని పేర్కొన్నారు. సర్వే ఆధారంగా రూపొందించిన నివేదికల ద్వారా బీసీలకు న్యాయమైన రిజర్వేషన్‌ను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ చర్యలు చక్కగా అమలవుతున్నాయని చెప్పారు. మిగిలిన ఇతర కులాల లెక్కలను సైతం సమగ్రంగా అందుకోవడానికి ప్రత్యేక సర్వేలు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఉద్యోగుల పాత్ర మరింత కీలకమవుతుందని, వారి కృషి వల్లనే వాస్తవ సమాచారం వెలుగులోకి వస్తుందని చెప్పారు.

సర్వేలో పాల్గొన్న ఉద్యోగుల పట్టుదల ప్రభుత్వానికి ఉపకరించిందన్నారు. ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యల కారణంగా అధైర్యానికి లోనవ్వవద్దని ప్రతి ఒక్క అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పరిష్కారం దిశగా కమిటీలు ఏర్పాటు చేసి ముందుకెళ్తుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా ప్రజల వరకు చేరాలంటే ఉద్యోగుల సహకారం అవసరమని, వారు తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని కోరారు.

### హైదరాబాద్-విజయవాడ

## 6 లైన్ల రహదారి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం వేగవంతం చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రహదారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని అందుకే వాజ్‌పేయి హయాంలో ఎన్డీఏ ప్రభుత్వం 'స్వర్ణ చతుర్భుజి' పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.

2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దాన్ని నిలిపివేసిందన్నారు. రోడ్ల నిర్మాణంపై రూ. లక్షల కోట్లు ఎందుకని ఆనాడు విమర్శించారని మండిపడ్డారు. 2014లో తెలంగాణలో 2500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉండేవని పదేళ్ల తర్వాత అవి 5200 కిలోమీటర్లకు చేరుకున్నాయన్నారు. ఈ విస్తరణ తెలంగాణలోని 32 జిల్లా కేంద్రాల గుండా జాతీయ రహదారుల అనుసంధానికి తోడ్పడిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం వేగవంతమైందని కిషన్ రెడ్డి తెలిపారు. గత పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో రింగ్ రోడ్ల అభివృద్ధి జరుగుతోందని కిషన్ రెడ్డి తెలిపారు. అనుసంధానం కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చు పెడుతోందన్నారు. తెలంగాణకు సంబంధించి 5 ప్రధాన కారిడార్ల నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. మే 5న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణకు వస్తున్నారన్నారు. రూ. 5416 కోట్లతో 26 ప్రాజెక్టుకలు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్, హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య ఆరులైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో కొన్ని చోట్ల భూసేకరణ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. భూసేకరణ ఆలస్యమైతే నిర్మాణం కూడా ఆలస్యమవుతుందన్నారు. ఎంత త్వరగా భూమి సేకరించబడితే అంత త్వరగా రహదారుల నిర్మాణం పూర్తవుతుందన్నారు.

## పహల్గాం దాడిపై ఎన్ఐఏ రిపోర్ట్

చూడడానికి వచ్చిన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులు చేశారు. దీని వెనుక ఉన్నది పాకిస్థాన్కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అని భారత్ భావిస్తోంది. దీనికి పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) పాక్ సైన్యం నుంచి పూర్తి మద్దతు ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు.ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ సదానంద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో 'పహల్గాం ఉగ్రదాడి నివేదిక' రూపొందించారు. దాదాపు 150 మంది సాక్షులు చెప్పిన సాక్ష్యాలు, దాడి జరిగిన రీతిని వివరించే త్రీడీ రీక్రియేషన్, ఘటనా స్థలంలో దొరికిన కాట్రిడ్జెస్, బాలిస్టిక్ విశ్లేషణలు సహా పలు ఆధారాలతో ఈ నివేదిక రూపొందించినట్లు, దీనిని అతిత్వరలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖను సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. 'ఇది సరిహద్దు అవతల నుంచి సమన్వయంతో, పక్కా ప్రణాళికతో, చాలా జాగ్రత్తగా చేసిన ఉగ్రదాడి. ఉగ్రవాదులు బేతాబ్ లోయలో ముందుగానే ఆయుధాలను మోహరించారు. ఆ ప్రాంతంలోని ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ (ఓజీడబ్ల్యూ) ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చారు. వారికి నిఘా సమాచారాన్ని కూడా అందించారు' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

**ఆ ఉగ్రవాదులు ఇంకా కశ్మీర్లోనే ఉన్నారు**

పహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉన్న హ్యాండ్లర్స్ (నిర్వాహకుల)తో సంప్రదింపులు కొనసాగించారు. అంతేకాదు ఇప్పటికీ వాళ్లు దక్షిణ కశ్మీర్లోని కొన్ని ప్రాంతాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులకు సహకరిస్తున్న జాబితాను ఎన్ఐఏ రూపొందించింది. వారి నెట్వర్కు విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతోంది. ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ ఈ వారం స్వయంగా బైసరన్కు వెళ్లారు. దర్యాప్తు పరోగతి గురించి స్వయంగా పర్యవేక్షించారు. ఎన్ఏఐ బృందాలు ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో మరిన్ని సాక్ష్యాల కోసం ప్రయత్నిస్తోంది. అలాగే మరింత మంది సాక్ష్యుల నుంచి వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తోంది. ఉగ్రదాడి జరిగిన విధానాన్ని , ఆ సంఘటనల క్రమాన్ని తెలుసుకునేందుకు ఎన్ఐఏ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఉగ్రదాడి నుంచి బతికి బయటపడిన వ్యక్తుల వాగ్మూలాలను సేకరించడానికి అదనపు బృందాలను పంపించింది. అలాగే స్థానికులు, కీలక ప్రత్యక్ష సాక్షులను, ఫొటోగ్రాఫర్లను కూడా ఎన్ఐఏ ప్రశ్నిస్తోంది.

**దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు వీళ్లే!**

పహల్గాం ఉగ్రదాడులకు పాల్పడినట్లు భావిస్తున్న ముగ్గురు అనుమానితుల స్కెచ్లను అధికారులు విడుదల చేశారు. వారిలో ఇద్దరు పాకిస్థానీయుల కాగా, ఒకరు భారత్లోని అనంత్నాగ్ జిల్లాకు చెందినవాడు. తల్హా భాయ్ (అలీ భాయ్), హాషీమ్ ముసా (ఆలియాస్ సులేమాన్) పాక్కు చెందినవారు కాగా, ఆదిల్ హుస్సేన్ థోకర్ స్థానిక ఉగ్రవాది. ఈ ముగ్గురికి లష్కరే తోయిబాతో అనుబంధం ఉంది. ఈ ఉగ్రదాడికి సంబంధించి ప్రశ్నించేందుకు కశ్మీర్ లోయలో దాదాపు 2000 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాదు ఈ ఉగ్రవాదుల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 లక్షల రివార్డు పోలీసులు ప్రకటించారు.

### ప్రపంచంలో అత్యంత విలువైన

## కంపెనీగా మైక్రోసాఫ్ట్

శుక్రవారం నాడు అమెరికా స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (మార్కెట్ విలువ) 3.235 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో, ఐఫోన్ తయారీదారు ఆపిల్ మార్కెట్ విలువ 3.07 ట్రిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. దీంతో టెక్ ప్రపంచంలో మైక్రోసాఫ్ట్ అగ్రపీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ జాబితాలో ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా 2.76 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో మూడో స్థానంలో నిలిచినట్లు 'ది ఇన్ఫర్మేషన్' న్యూస్‌లెటర్ నివేదించింది.గత గురువారం విడుదలైన మార్చి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలను మించిపోవడంతో మైక్రోసాఫ్ట్ షేర్లు భారీగా పెరిగాయి. తమ క్లౌడ్ సేవలు, ఏఐ ఉత్పత్తులకు డిమాండ్ స్థిరంగా కొనసాగుతోందని కంపెనీ సీఈఓ పెట్టుబడిదారుల సమావేశంలో హైలైట్ చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై మైక్రోసాఫ్ట్ వ్యూహాత్మకంగా దృష్టి సారించడంపై పెట్టుబడిదారులలో విశ్వాసం పెరుగుతోందని ఈ ఏడాది కంపెనీ షేర్ల పనితీరు సూచిస్తోంది. 2015 అక్టోబర్‌లో కూడా అజూర్ క్లౌడ్ వ్యాపారం ఆదాయం రెట్టింపు కావడంతో మైక్రోసాఫ్ట్ షేర్లు 10 శాతం పెరిగిన విషయాన్ని ఇన్వెస్టోపీడియా గుర్తుచేసింది.మరోవైపు, ఆపిల్ కూడా తొలి త్రైమాసికంలో ఐఫోన్ అమ్మకాల జోరుతో అంచనాలను మించిన ఫలితాలను ప్రకటించింది. అయినప్పటికీ, వాణిజ్య సుంకాల (టారిఫ్‌లు) రూపంలో కంపెనీ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆపిల్ తన సప్లై చెయిన్ లో దిగుమతి చేసుకున్న భాగాలపై ఎక్కువగా ఆధారపడటమే ఇందుకు కారణం. ఈ సుంకాల ప్రభావం కారణంగా, ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆపిల్ షేర్ ధర సుమారు 18 శాతం క్షీణించింది. ఇది ప్రధాన టెక్నాలజీ కంపెనీలలో అతిపెద్ద క్షీణతలలో ఒకటి కావడం గమనార్హం. ప్రస్తుత పరిస్థితులు మారకపోతే, ఈ త్రైమాసికంలో సుంకాల కారణంగా అదనంగా 900 మిలియన్ డాలర్ల భారం పడవచ్చని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ సూచించారు.డౌ జోన్స్ మార్కెట్ డేటా ప్రకారం, ఈ సంవత్సరం ప్రారంభంలో ఏ కంపెనీ మార్కెట్ విలువలోనైనా ఆపిల్ క్షీణతే అతిపెద్దది. టెస్లా కూడా ఈ ఏడాది భారీగా (29%) షేర్ల పతనాన్ని చవిచూసింది. మొత్తంగా, క్లౌడ్, ఏఐ రంగాల్లో మైక్రోసాఫ్ట్ దూకుడు, మరోవైపు ఆపిల్ ఎదుర్కొంటున్న వాణిజ్య సవాళ్లు ఈ మార్కెట్ విలువ మార్పునకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

## ఈ నెల 8,9 తేదీల్లో తుడా టవర్స్ వాణిజ్య గదుల వేలం క్రమపద్ధతిలో నిర్వహించండి

**- ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య**

మే 8,9, తేదీల్లో ఈ-వేలం ద్వారా తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని క్రమపద్ధతిలో నిర్వహించాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్ ను శనివారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తిరుపతిలోని అన్నమయ్య కూడలి వద్ద 3.60 ఎకరాల స్థలంలో ఉ+13 అంతస్తులతో ప్రతిష్టాత్మకంగా "తుడా టవర్స్" నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో నివాసయోగ్యమైన గదులకు ఈ-వేలం నిర్వహించి విక్రయించడం జరిగిందని తెలిపారు. తుడా టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8, 9 తేదిలలో ఈ-వేలం ద్వారా విక్రయించనున్నామని అన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వాణిజ్యపు గదులు 2000 నుండి 9000 చదరపు అడుగుల విస్తీర్ణముతో నగర వాణిజ్య సముదాయములకు అత్యంత అనువైనదిగా నిర్మించమని అన్నారు. వివరముల కొరకు తుడా కార్యాలయము, తుడా టవర్స్ వెబ్సైట్లు లిలిలి.బిబీటజీబినీలివతీబ.తిని/లిలిలి.బిబీటజీజీజూ.తిని సంప్రదించాలని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, డి.ఈ. భాషా, తదితరులు ఉన్నారు.

## జీహెచ్ ఎంసి సిబ్బంది ధర్నా

**హైదరాబాద్** సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్ పై బిజెపి కార్పొరేటర్ రాకేష్ జస్వాల్ జరిపిన దాడి వివాదస్పదమయింది. సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్ పై దాడికి నిరసనగా ఆబిడ్స్ లోని జిహెచ్ఎంసి కార్యాలయం ముందు జిహెచ్ఎంసి అధికారులు ధర్నాకు దిగారు. విధులు బహిష్కరించి జిహెచ్ఎంసి కార్యాలయం నిరసన చేపట్టారు. వెంటనే రాకేష్ జస్వాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. బిజెపి జాంబగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు...

## ఉప్పల్‌లో బీజేపీ ర్యాలీ

**మేడ్చల్** ఉప్పల్ కారిడార్ పనులు వేగవంతం చేయడానికి ప్రభుత్వం పై, జిహెచ్ఎంసి పై వత్తిడి పెంచడానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉప్పల్ లో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ఉప్పల్ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న సందర్భంగా కేంద్రాన్ని ఒప్పించి 600 కోట్ల నిధులతో ఫ్లైఓవర్ను సాంక్షన్ చేయించడం జరిగింది.

కానీ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు వెడల్పు చేయించడంలో,బాధితులకు నష్ట పరిహారం చెల్లించే విషయంలో విఫలమైంది అని మండిపడ్డారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో అలసత్వాన్ని ప్రదర్శిస్తూ కారిడార్ పనుల విషయంలో జాప్యం కొనసాగిస్తుంది. గతంలో ఈ అలసత్వానికి కేంద్ర ప్రభుత్వం 20 కోట్ల నష్టపరిహారాన్ని కూడా విధించిందని గుర్తు చేశారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్ఎంసి అధికారులు పనులను వేగవంతం చేసి కారిడార్ పనులు పూర్తి చేయాలని అన్నారు. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో అనేక తరహాలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## "ఆనందం"తో సెక్రటరీ జన్మదిన వేడుకలు:రాగిరి



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గ్రేడ్ వన్,ఉన్నత శ్రేణి అధికారి ఎం.వేంకన్న పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన మార్కెట్ కమిటీ.ఏఎంసీ కమిటీ ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ "41"వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అధికారికి శుభాకాంక్షలు తెలిపిన కమిటీ ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, వైస్ ఛైర్మన్ దేవేందర్ కమిటీ సభ్యులతో పాటు యాదృచ్ఛికంగా వచ్చిన సికింద్రాబాద్ వెజిటబుల్ కమిషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి జనరల్ సెక్రటరీ ఆర్వీసి రాజు ఉపాధ్యక్షుడు మిర్యాల శ్రీనివాస్ మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మార్కెట్ గ్రేడ్ వన్ అధికారి ఎం వేంకన్న మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా అందరు శుభాకాంక్షలు తెలియజేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.ముఖ్యంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, వైస్ ఛైర్మన్ దేవేందర్ కలిసి నా "41"వ పుట్టినరోజుని ఇంత ఘనంగా నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఏఎంసీ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, వారికి కూడా నా హృదయ పూర్వక ధన్యవాదాలు సెక్రటరీ ఎం వేంకన్న తెలియజేశారు.

## మానవతా దృక్పథంతో జిల్లా కలెక్టర్ ఆర్థిక చేయూత

**అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బంది పడుతున్న మూడు కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున సాయం**

**కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపిన ఆయా కుటుంబాలు**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బంది పడుతున్న మూడు కుటుంబాలకు కలెక్టర్ ఆర్థిక చేయూత అందించారు. అనారోగ్య, ఆర్థిక కారణాలతో తాము ఇబ్బంది పడుతున్నామని, తమను ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తంగళ్ళపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన దాసరి మల్లవ్వ, కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట కళావతి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన సింగం నర్సయ్య విన్నవించారు. ఆయా కుటుంబాల స్థితిగతులు చూసి చలించిన కలెక్టర్ వెంటనే ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో ఆయా కుటుంబాల బాధ్యులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. వారంలోగానే తమకు ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ కు ఆయా కుటుంబాల బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ప్రణాళిక, లక్ష్యంతో ఉన్నతస్థానాలకు ఎదగాలి:కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**పదిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) విద్యార్థులు పక్కా ప్రణాళిక, లక్ష్యంతో ఉన్నతస్థానాలకు ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అభినందించారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు విష్ణుప్రియ 580, విగ్నారెడ్డి 573, వైష్ణవి 553, అలేఖ్య 551 మార్కులు సాధించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిహర్షిత్ 573, భానుతేజ 562, నవజీత్ 561, సుశృత 558, కావ్య 545, మైత్రి 531, భవ్య 535 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించి జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఐఐటీ లక్ష్యంగా కష్టపడి చదువుతూ తల్లిదండ్రులకు3 మంచి పేరును తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా విద్యాలయాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుడి కుమారుడికి ఓయూ డాక్టరేట్



తార్నాక(ప్రశ్న న్యూస్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్ పట్టణం లో సింగరేణి గనిలో కార్మికుడిగా పని చేసినటువంటి తోట సదానందం విజయలక్ష్మి దంపతుల కుమారుడు తోట శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీ లో డాక్టరేట్ పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో "డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ కోఆర్డినేటెడ్ కంట్రోల్ ఆఫ్ మల్టీ లెవెల్ ఇన్వెర్టర్స్ ఇన్ ఏ డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ సిస్టం" అంశం పై ప్రొఫెసర్ పి సతీష్ కుమార్ మరియు ప్రొఫెసర్ కె కృష్ణవేణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేసి గౌరవ డాక్టరేట్ పొందాడు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులు, కుటుంబ సభ్యులు మరియు పలువురు విద్యార్థులు ,స్నేహితులు శ్రీనివాసు ను అభినందించారు.

# ఫలితాలు ప్రకటించని పరీక్షలెందుకు

### ఆరు నెలలుగా పరీక్ష ఫలితాల నిరీక్షణలో లాబ్ టెక్నిషియన్ అభ్యర్థులు






హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఉద్యోగాల నిరీక్షణలో నిరుద్యోగుల జీవితాలు కొవ్వత్తిలా కరిగి పోతున్నాయని పలువురు తమ అసహనాన్ని వెళ్ళబుచ్చారు.గత సంవత్సరం సెప్టెంబర్11వ తేదిన లాబ్ టెక్నిషియన్ ఖాళీల భర్తీ కోసం పరీక్షలను నిర్వహించిన ప్రభుత్వం, ఆరు నెలలైనను నేటి వరకు ఫలితాలు వెల్లడించడంలో జాప్యం చేస్తు నిరుద్యోగుల జీవితాలతో చలగాట మాడడం దురదృష్టకరమని తెలంగాణ ఎన్ఎచ్ఎం జేఏసి సభ్యులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నవంబర్ 11న నిర్వహించిన పరీక్షల వెల్లడించడంలో జరుగుచున్న జాప్యంపై అభ్యర్థులు మెడికల్ బోర్డ్ ముట్టడికి పిలుపునివ్వగా ఒక రోజు ముందు (మార్చి10) కి విడుదల చేస్తు అభ్యంతరాలుంటే అప్లైచేసుకోవాలని ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కాని అప్పటి నుండి నేటి వరకు పరీక్ష ఫలితాలను వెల్లడించడంలో తీవ్ర జాప్యం చేస్తు ఈ అంశాన్ని మరుగున పడేసారు. దీంతో పరీక్షలు వ్రాసిన అభ్యర్థులకు ఎటు పాలుపోని పరిస్థితులు దాపురించాయి. నిద్రా ఆహారాలు మాని రాత్రింబవళ్ళు కష్టపడి పరీక్షలు వ్రాస్తే ఫలితాలు వెల్లడించకుండా నెలల తరబడి జాప్యం చేయడంతో ఖాళీల భర్తీ చేయడంపై ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుందని పలువురు అభ్యర్థులు అనుమానాలను వ్యక్తం చేసారు. ఇక ఫలితాలు వెల్లడించడంలో మరికొంత కాలం ఇలాగే సాగదీస్తే కష్టపడి చదివి పరీక్షలు వ్రాసిన కొంత మంది అభ్యర్థుల ఏజ్ బార్ అయ్యే అవకాశం ఉందని, దీంతో వారి పరిస్థితి రెండిటికి చెడ్డ రేవడిగా మారే ప్రమాదం ఉందని విచారం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించినను కొత్త రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఆద్వర్యంలో ప్రతిపాధించిన జాబ్ క్యాలండర్లో మొదటి జాబ్ నోటిఫికేషన్ ఫలితాల కోసం నెలల తరబడి నిరీక్షిస్తుండడం గమనార్హం. ప్రభుత్వ ఇచ్చిన హామీలే అమలుకు నోచుకోకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేసారు. కరోనా విజృంబన సమయంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి కుటుంబాలకు దూరమై రోగులకు సేవలందించామని, క్షయ వంటి భయంకరమైన అంటురోగాలకు ఎదురొడ్డి విపత్కర పరిస్థితుల్లో వైద్యసేవలందించామని, ఇంత చేసిన తాము ప్రభుత్వ నిరాధారణకు గురవుచున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. ఇక ఫలితాలు వెల్లడించని పరీక్షలెందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి లాబ్ టెక్నిషియన్ల పరీక్ష ఫలితాలు వెల్లడించి ఖాళీల భర్తీకి కార్యచరణ ప్రారంభిచాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఆందోళనలకు కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

### మెడికల్ బోర్డ్ ముందు అభ్యర్థుల బైటాయింపు

పరీక్షలు నిర్వహించి ఆరు నెలలైన ఫలితాలు వెల్లడించడంలో ప్రభుత్వ అలసత్వంపై తెలంగాణ ఎన్ఎచ్ఎం లాబ్ టెక్నిషియన్ల జేఏసి సభ్యులు శుక్రవారం నాడు కోఠిలోని డి.ఎచ్.ఎం.ఎస్ కార్యాలయ ఆవరణలోని మెడికల్ బోర్డ్ ముందు భారీగా బైటాయించిన అభ్యర్థులు వెంటనే పోటీ పరీక్షల ఫలితాలు వెల్లడించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితులే జాప్యనికి కారణం

రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీల భర్తీ చేయడంలో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తుంది. హామీలకనుగుణంగా క్షేత్రస్థాయిలో కార్యచరణ అమలుకావడం లేదు. దీనంతటికి కారణం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులే కారణమని సమాచారం. గత ప్రభుత్వ అనాలోచిత, ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన పాలనతో రాష్ట్ర ఖజానా ఖాళీగా మారి శక్తికి మించిన అప్పుల వల్ల కొత్త ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుంది. ఈ నేపద్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలివ్వడమే గగనమైంది. ఈ పరిస్థితుల్లో ఖాళీల భర్థీచేయడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని ఈ కారణంతోనే పోటీ పరీక్ష ఫలితాలు వెల్లడించడంలో జాఘ్యం జరుగుతుందని విశ్వాసనీయ సమాచారం.

# నయీం పోయిండు, నయా వంచకులు వచ్చారు

- అసురులు అంతం, ఆయన న్యాయం దక్కలే
- "32"ఏళ్ల కళా కన్నీటి చిరునామాగా నిలించింది
- పేదవాడిని పరిషాన్ చేస్తున్న ల్యాండ్ మాఫియా
- యాదగిరిగుట్ట చూట్టూ నయీం అనుచరులు పాగా
- డాన్ కుక్క చావు చస్తే, అనుచరులు తొడేళ్లులా పిక్క తింటున్నారు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో నాలుగున్నర దశాబ్దాల పాటు ఓం వెలుగు వెలిగిన ల్యాండ్ మాఫియా డాన్ నయీం.ఇటు పాలకులు,అటు ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు.అసలు విషయానికి వస్తే యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం చూట్టూ మాఫియా డాన్ నయీం తన పాదం ఎక్కడ పేడితే అక్కడ ఆ భూమి తనదేనంటూ రైతుల్ని,పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన విషయం విదితమే.కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు ఆయన ఆటలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.2014 జూన్ 2 నాతెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పాటు అయిన తరువాత నయీం ఆటలు నెమ్మదిగా తగ్గుముఖం పట్టాయి.ఆయనకూడా కొన్ని సందర్భాల్లో టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ న్నీ కూడా ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తి అండర్ గ్రౌండ్ ల్యాండ్ మాఫియా డాన్ నయీం.తెలంగాణ సర్కార్ ప్రజలకి, ప్రభుత్వానికి తులాభారంగా మారిన వ్యక్తి నయీం.అందుకే అప్పటి ప్రభుత్వం నయీం ని "ఎన్ కౌంటర్"చేసి శాంతిభద్రతలకు ఆటంకం కల్పించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదంటూ అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నయీం బలైయ్యాడు.సరే ఇది నిన్నటి కథ! ఓం రాక్షసుడు పొయాడు అనుకుంటే,ఆయన రూపంలో ఆయన సతీమణి దాపురించింది అంటూ ఆవేదనతో నిన్న రాచకొండ కమీషనర్ రేట్ పరిధిలో ఉన్న నేరేడ్మెట్ లో విలేకరుల సమావేశంలో తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు బాధిత ప్రజలు.నెరేడ్ మెట్ లో నయీమ్ బాధితుల ప్రెస్ మీట్.భువనగిరిలో 154 ఎకరాల భూమిని కబ్జా చేసిన నయీమ్ భార్య ఆమె అనుచరులు అంటున్నారు.1993లోనే లేఔట్ లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు.సుమారు 400 మంది బాధితులు 500 ప్లాట్లు కొనుగోలు చేశారు.శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్న విషయం కూడా తెలియజేసిన బాధితులు.అలాగే పేదలు, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ప్లాట్లు కొనుగోలు చేశారు.2006లో నయీమ్ భార్య షేక్ హసీనా బేగం ఆమె అనుచరులు కలిసి చేసుకున్నఏజీపిఏలు చేసుకున్నారు.తప్పుడు పత్రాలతో నయీమ్ భార్య హసీనా బేగం ఏజీపిఏ లు చేసుకున్న విషయం ఆధారాలు చెబుతున్నాయి.నకిలీ పత్రాలుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తూ అదిగాక అప్పటినుండి తమ ప్లాట్ లోకి వెళ్లకుండా నయీం అనుచరులు బెదిరింపులకు దిగుతున్న విషయాన్ని తెలియజేశారు.నయీం చనిపోయిన తర్వాత సిట్ ఏర్పాటు చేసి బాధితులందరికీ న్యాయం చేస్తామని అధికారులు చెప్పిన మాటలు నీటి మూటలేనా అని ప్రశ్నించారు.ఇప్పటివరకు మాకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు.నయీమ్ ఆస్తులను ప్రోబిటేడ్ లిస్టులో పెట్టామని అప్పటి ప్రభుత్వం తెలియాజేసిన విషయాన్ని గుర్తు చేశారు.భువనగిరిలోని మా ఫ్లాట్లకు సంబంధించిన సర్వే నెంబర్ లను మళ్ళీ ప్రోబిటేడ్ లిస్టులో నుంచి తొలగించి విక్రయాలు జరుపుతున్నారు.సిట్ విచారణ పూర్తయ్యే వరకు ఆ సర్వే నెంబర్లను ప్రోబిటేడ్ లిస్టులో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు బాధితులు తెలిపారు.ఈ కేసులో పోలీసులు ఇంకా చార్ సీట్ కూడా వేయలేదు పోలీసులు చార్ సీట్ వేస్తే కోర్టు విచారణ జరిపి మాకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నా బాధితులు.ఇప్పటికైనా ప్రభుత్వం 500 మంది పేదలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.నయీమ్ చనిపోయిన అతని అనుచరుల అరాచకాలు ఇంకా కొనసాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

## ధాన్యం కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు.శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత ఎంపీడీవో ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ధాన్యం సేకరణ, ట్యాబ్ ఎంట్రీలు . ఐకేపీ, కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి దాకా సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరించిన వెంటనే వాటి వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలని కలెక్టర్. సూచించారు. నాణ్యతా ప్రమాణాలు మేరకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల నుంచి నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు. ధాన్యం డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడేలా చూడాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వివరాలు ట్యాబ్ ఎంట్రీ చేయని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐకేపీ, డీసీఎంఎస్, ప్యాక్స్, ఆద్వర్యంలో ఇప్పటి దాకా 2715 మంది రైతుల నుంచి 53,602 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. మొత్తం రూ. 28కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో వేశామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నటుడు విజయ్ దేవరకొండ పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

**- తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్**

సినీ నటుడు విజయ్ దేవరకొండ కొన్ని రోజుల క్రితం సినీ నటుడు సూర్య నటిస్తున్న రెట్రో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో గిరిజనుల గురించి అవమానకరంగా మాట్లాడడం జరిగింది.

దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని త్యాగాల చరిత్ర ఉన్న గిరిజన జాతి గురించి ఇలాంటి అవగాహన లేకుండా మాట్లాడిన విజయ్ దేవరకొండపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ జరిగిన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజన జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆయన ఇళ్ళు, ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు.

## ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి** ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుండి స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా మరియు సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నిజంగా అవసరమైన ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.

గ్రామ, వార్డు స్థాయిలో అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, వారిని ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకూడదని, సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయడం జరుగుతుందని, ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగహన కల్పించాలని అన్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ విచారణ ప్రత్యేక అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

## చేతి పంపుకు మరమ్మత్తు చేయించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం చల్లపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా చేతి పంపు చెడిపోయి మరమ్మత్తుకు నోచుకోకపోవడంతో గ్రామస్తులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చల్లపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద గల చేతి పంపుకు మరమ్మత్తు చేయించాలని గ్రామస్తులు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కు విన్నవించగా, స్పందించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో శనివారం మరమ్మత్తులు చేయించినారు.

అసలే ఎండాకాలం కావడంతో గ్రామస్తులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్న క్రమంలో సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ స్పందించి చేతి పంపుకు మరమ్మత్తులు చేయించడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## మోదీ సర్కారు కులగణన నిర్ణయాన్ని స్వాగతించిన బోయినిపల్లి మండల భాజపా

**- కులగణన నిర్ణయానికి మద్దతుగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పర్శరాం**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) భారతదేశంలో కులగణన నిర్వహించేందుకు భాజపా మోదీ సర్కారు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ బోయినిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ మండల శ్రేణుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల భాజపా అధ్యక్షులు ఎడపల్లి పర్శరాం నేతృత్వంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పర్శరాం మాట్లాడుతూ కేంద్ర రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో, జనాభా లెక్కలతో పాటు కులగణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేసింది. ఇది బీసీ,ఎస్సీ,ఎస్టీ లతో సహా అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిచ్చే కీలక నిర్ణయంగా భావిస్తున్నామని, సెప్టెంబర్ నుండి ఈ గణన ప్రారంభమై రెండు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నట్లు తెలిసిందని,కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు కులగణనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని,ఇప్పుడు మాత్రం తప్పుల తడకగా లెక్కలు చేసి మళ్లీ చేస్తామంటూ ప్రకటనలు చేస్తోందని విమర్శించారు.భాజపా మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా సామాజిక వర్గాలు హర్షధ్వానాలతో స్వాగతిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహాచారి,మాజీ భాజపా మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి,గంగిపల్లి స్వామికుమార్, పసికంటి వెంకటేశం, చీలుముల రమేశ్, కొండం శ్రీనివాస్ రెడ్డి, బూత్ అధ్యక్షులు కళ్యాణం అనిల్ కుమార్, మెరుపుల గంగాధర్ గౌడ్, సారంపల్లి రాజు,గంగాధర్ చారి, మోడీ నిఖిల్, నవీన్, రజినీకాంత్, సాయికుమార్, ప్రశాంత్, అనిల్, దూస శ్రీకాంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగణనలో కులగణనపై కేంద్ర నిర్ణయానికి స్వాగతం

**- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు**

**- బత్తుల మహేందర్ యాదవ్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న జనగణనలో కులగణన చేపట్టే నిర్ణయాన్ని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుబత్తుల మహేందర్ యాదవ్ స్వాగతించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా వెనుకబడిన తరగతులకు, బీసీ కులాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు."జాతి గణనతో పాటు కుల గణన చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాము.కుల గణన జరిగితేనే ఏ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందో గుర్తించి, వారికి న్యాయం చేయగలమన్న నమ్మకం ఉంది," అని బత్తుల మహేందర్ యాదవ్ తెలిపారు.తెలంగాణలోని వివిధ బీసీ సంఘాలు,కుల సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రతిభావంతులను ప్రోత్సహించడం మా బాధ్యత

**- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్**

**- ఎస్సెస్సీ లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థి జీవన్‌కు సన్మానం-శుభాకాంక్షలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వేములవాడ పట్టణానికి చెందిన కనికరపు జీవన్‌కు శనివారం ఘనసన్మానం జరిపారు. 585/600 మార్కులు సాధించిన జీవన్‌ను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తన క్యాంపు కార్యాలయంలో బొకే అందించి, శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా విప్ ఆది మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి శ్రమించి చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలి. ఇటువంటి ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం మా బాధ్యత," అని అన్నారు. వారి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ ఉన్నారు.

# సర్కారు నిర్లక్ష్యంతోనే రైతులకు తీరని నష్టం...

**- విపత్తుపై పాలకులకు ముందుచూపు లేదు**

**- మాయిశ్చర్ పేరుతో కాంటాలు ఆలస్యం చేసిండ్లు**

**- ఎకరాలకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలే**

**- ఈ ప్రాంత రైతులపై మంత్రికి చిత్తశుద్ధి లేదు**

**- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





మంథని ( ప్రశ్న న్యూస్) ప్రజాపాలన పేరుతో పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం మూలంగానే రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, అకాల వర్షానికి పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షంతో తడిసిన ధాన్యంను ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కష్టాలను ఎదుర్కొంటూ పుట్టెడు పెట్టుబడులతో సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో చేజారి పోతే ఎంత బాధ ఉంటుందో పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఏటా ఈ సీజన్‌లో అకాల వర్షాలు వస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదిహేను ఇరువై రోజుల క్రితం కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే మాయిశ్చర్ రాలేదంటూ కాంటాలు పెట్టకపోవడం మూలంగానే ఇంత పెద్ద మొత్తంలో నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. ఇంత పెద్ద ఎత్తున రైతులకు నష్టం జరిగితే అడిషనల్ కలెక్టర్ వచ్చి చూసివెళ్లాడే కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కనీసం స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాపుదనపోళ్ల మీటింగ్‌లకు పోయి కాపుదనం కుటుంబంలో పుట్టకపోయినా మీ గురించి ఆలోచన చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఈనాడు రైతులకు కన్నీటి పర్యంతమవుతుంటే పట్టించుకోడా అని ప్రశ్నించారు. ఆనాడు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారని, కానీ ఇప్పుడు ధాన్యం తడిసిందని రైస్ మిల్లుల వద్ద దించుకోవడం లేదని, బస్తాలు దించుకోకపోతే రైతులతో కలిస రైస్ మిల్లును ముట్టడిస్తామన్నారు. నియోజకవర్గంలోని గరీబోళ్లే ఓట్లు వేస్తే 40ఏండ్లుగా అధికారంలో ఉంటూ కనీసం ప్రజల గురించి ఆలోచన చేయడం లేదని, ఓట్లు వస్తే నోట్ల సంచులతో వచ్చి గెలువచ్చనే ఆలోచన మానుకోవాలన్నారు. హైదరాబాద్‌లో నాలుగు ఆఫీస్‌లు ప్రారంబించి దోపిడి చేస్తున్నారని, దోపిడి చేసిన దాంట్లో కొంతైనా పేద ప్రజలకు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా శ్రీపాద ట్రస్ట్ పేరున పంట నష్టపోయిన రైతులకు పదివేల చొప్పున అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తండ్రి ఆశయాలంటూ పదపదే మాట్లాడే ఎమ్మెల్యే తన తండ్రి ఆశయాలేంటో చెప్పాలని, ఆ ఆశయాలు పేద ప్రజల గురించే అయితే అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున ఇప్పించి ఆదుకోవాలన్నారు. మండలంలో ఇంత పెద్ద విపత్తుకు ప్రభుత్వంతోపాటు అధికారులు, పాలకులే కారణమని, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఒక రైతు బిడ్డగా ఎందుకు ఆలోచన చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కనీసం రైతులకు సౌకర్యాలు కల్పించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కేంద్రాల నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్‌లు మీ కోసం కాదని, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వినియోగించాలని ఆయన హితవు పలికారు.ప్రజా ప్రభుత్వమని, వందేళ్ల చరిత్ర ఉందని గొప్పలు చెప్పుకోవడం కాదని, ఇలాంటి విపత్తు జరిగితే రైతులకు అండగా నిలిచి భరోసా ఇవ్వాలని ఆయన అన్నారు. నిత్యం ముఖ్యమంత్రి పక్కనే కూర్చుంటూ అనేక సలహాలు ఇచ్చే మంత్రి ఇక్కడి ప్రజల గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని, ప్రజలకు ఉపయోగపడని పదవులు ఎందుకని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలుస్తామని, ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు సరైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్సెస్సీ ఫలితాల్లో విలాసాగర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు : ఏనుగుల కనుకయ్య**





బోయినిపల్లి ,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి ఇటీవల వెల్లడించిన ఎస్సెస్సీ ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభకు కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు, కురుమ సంఘం జిల్లాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలాసాగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 22 మంది ఎస్సెస్సీ పరీక్షలకు హాజరు కాగా 22 మంది ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమని,పాఠశాల ప్రథమ స్థానంలో గంగాధర శివాని (559 మార్కులు), గంగాధర కావ్య(543)ద్వితీయ స్థానంలో సర్కారు బడిలో చదివి కార్పోరేట్ స్థాయి పాఠశాలలకు ధీటుగా నిలిచారని హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్,ఉపాధ్యాయ బృందం ప్రత్యేక చొరవతోనే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతను సాధించారని కొనియాడారు.ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరంలో మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలని,విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి,ఉత్తమ ప్రయోజకులుగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మెమెంటోలు ప్రధానం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి,వెంకట హనుమాన్, మధుసూధన్, మోహన కృష్ణ, ప్రకాష్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ముందస్తు టీకాలు వేయించడం ద్వారానే వ్యాధుల నివారణ సాధ్యం

**- మండల పశు వైద్యాధికారి : డాక్టర్ సతీష్- 155 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు**





బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండల కేంద్రంలో పశువుల ఆరోగ్య రక్షణ చర్యలు, జాతీయ సేవా పథకంలో భాగంగా జిల్లెల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 155 పశువులకు టీకాలు వేసినట్టు వెటర్నరీ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ సతీష్ మాట్లాడుతూ, "గాలికుంటు వంటి వ్యాధులు పశువులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగిస్తాయి. ముందస్తుగా టీకాలు వేయడం ద్వారానే వాటి నివారణ సాధ్యమవుతుంది. రైతులు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఏడాది వెటర్నరీ విభాగం నిర్వహించే టీకాల కార్యక్రమాల్లో తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ రమేష్, జూనియర్ వెటర్నరీ అధికారి మధుమిత, జిల్లెల్ల అగ్రికల్చర్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ బాబు, డాక్టర్ మాధవి, గోపాలమిత్ర కట్కూరి శ్రీనివాస్,వ్యవసాయ కళాశాల విద్యార్థులు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర దాడికి నిరసనగా ఆల్విన్ కాలనీ ముస్లింల ర్యాలీ

కూకట్ పల్లి (ప్రశ్నన్యూస్) కశ్మీర్‌లోని పహల్గామ్ లో పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నమాజ్ ( ప్రార్థన) అనంతరం, ఎల్లమ్మ బండ చౌరస్తా లోని మిసైల్ మెన్ ఏ పి జే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి జాతీయ జెండాలను పట్టుకుని. పాకిస్తాన్ మర్దబాద్, డౌన్ డౌన్. హిందూస్తాన్ జిందాబాద్ అని హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అంటూ నినాదాలు చేశారు.ఉగ్రవాదులకు వ్యతిరేకం గా నినాదాలు చేశారు.మతంపై ద్వేషం నింపుకొని దాడులు చేయడం దారుణం అన్నారు.పాకిస్తాన్ చేయించినట్టి హేయమైన చర్యకు పాకిస్తాన్ కి తగిన బుద్ధి చెప్పాలని దానికి ప్రభుత్వానికి మేము అండగా ఉంటామని తెలిపారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ఈ దాడులకు బాధ్యులైన తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమం లో ముస్లిం యువకులు,మత పెద్దలు భారీ గా పాల్గొన్నారు.



# సమాజంలో పాత్రికేయుల సేవలు అమూల్యం

- మండలంలోని జర్నలిస్టులకు "ప్రపంచ పత్రికా స్వేచ్ఛా" దినోత్సవ శుభాకాంక్షలు
- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల అభివృద్ధి అధికారి భీమా జయశీల శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పాత్రికేయ సోదరులకు మిఠాయిలు పంపిణీ చేసి, శుభాభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ఒక మూల స్తంభం. సత్యాన్ని వెలికి తీసే కర్తవ్య నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ పాత్రికేయులు చూపే నిబద్ధత, ధైర్యం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. సమాజంలో వారి సేవలు అమూల్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు జర్నలిస్టులు, మండల పంచాయతీ అధికారి శ్రీధర్, ఏపీఓ సబిత, తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న ఆలయం వద్ద 150 మందికి అన్నదానం

- మై వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రోజున రాజన్న ఆలయం వద్ద 150 మంది పేదలకు, అన్నార్థులకు,భక్తులకు,యాచకులకు అన్నదాన సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ గత 1471 రోజులుగా ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తోంది. శనివారం అన్నదాతలుగా వేములవాడ రూరల్ ఎస్ఐ మిల్కూరి మారుతి-యమున దంపతులు సేవలందించగా, శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు %-% స్నేహలత దంపతులు, ప్రతాప్ సంపత్ %-% స్వప్న దంపతులు, నగుబోతు రవీందర్ %-% జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ %-% సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ %-% బాలచందర్ రాజు దంపతులు,రామడుగు శ్రీలత, ఆమె కుమార్తెలు, కోడళ్ళు ప్రజ్ఞ %-% శరత్ చంద్ర దంపతులు, శిరీష %-% సాయిచంద్ర దంపతులు, శర్వాణి %-% రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ కార్యక్రమానికి సహకారం అందించారు. అన్నదానంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పాత సంతోష్, పొలాస రాజేందర్, గొండ ప్రసాద్, పసుల శ్రీనివాస్, సగ్గు రాహుల్, పిట్టల రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించదలచిన దాతలు ట్రస్ట్ సభ్యులను సంప్రదించాలని నిర్వాహకులు మధు మహేష్ తెలిపారు.

# గౌతమ్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల కృషి హర్షణీయం

- విద్యార్థులను అభినందించిన ఆది శ్రీనివాస్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ మండలంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం ఘనంగా సన్మానించారు. 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పొన్నం రశ్మి ని క్యాంప్ ఆఫీసులో ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా, ఉత్తమ ఫలితాలు సాధించిన మరో విద్యార్థిని సానియా ఆర్ఫిన్‌ను కూడా సన్మానించి, పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేములవాడ మండలంలో గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థిని మొదటి ర్యాంకు సాధించడం గర్వకారణం. అలాగే జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించడం ప్రశంసనీయం" అని అన్నారు. విద్యార్థులందరిలో పోరాడే తత్వం ఉండాలని, తక్కువ మార్కులు వచ్చినా నిరుత్సాహ పడకుండా ముందుకు సాగాలని సూచించి, విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంలో పాఠశాల నిర్వాహకులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమ- రమేష్,డైరెక్టర్ శివ సాయి చరణ్,ప్రిన్సిపాల్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

# యక్షగాన కళలకు బాసట కావాలి

- రాష్ట్ర కన్వీనర్ : యెల్ల పోశెట్టి



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గం,చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నటరాజ కళామండలి ఆధ్వర్యంలో మూడు రోజుల చిరుతల రామాయణ నాటక ప్రదర్శన ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా రాష్ట్ర కళాకారుల విభాగం కన్వీనర్ యెల్ల పోశెట్టి హాజరై, "మరుగున పడుతున్న జానపద కళలను పరిరక్షించాల్సిన అవసరం ఉంది," అని పేర్కొన్నారు. వృద్ధ కళాకారులకు పింఛన్లు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలని,యక్షగాన కళామండలికి వాయిద్య పరికరాలు,మైక్ సౌండ్ సిస్టంలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నాటకంలో బొడ్డు రాములు, శ్రావణ శ్రీనివాస్, అనంతరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

# ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) ప్రజా ఆరోగ్యంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత చూపిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. "ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి గౌరవంగా వ్యవహరించాలి," అని విప్ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మంజూరు అయ్యే ఆర్థిక సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా, ఇప్పటివరకు రూ.20 కోట్లకు పైగా మంజూరైనట్లు వివరించారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం గ్రీన్ మ్యాట్ ఏర్పాటు,కుర్చీలు,తాగునీటి వసతి,ఫ్యాన్ల ఏర్పాటు వంటి ఏర్పాట్లను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్య సిబ్బంది నియామకానికి ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. మోకాళ్ల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించిన ఆయన, రానున్న రోజుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య,తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మే 20 దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె

- ఐక్య వేదిక నుంచి పిలుపు
- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి
- కడారి రాములు





వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లోని వివిధ ప్రభుత్వ శాఖలైన జిల్లా విద్యా,జిల్లా మెడికల్, ఆరోగ్య శాఖ,జిల్లా పంచాయతీ రాజ్ శాఖ,జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయాలకు మే 20న జరగబోయే దేశవ్యాప్తంగా సమ్మెకు సంబంధించిన నోటీసులను ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి, వాటిని నాలుగు కోడ్‌లుగా రూపాంతరం చేయడం ద్వారా, దేశ కార్మికులను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుకూలంగా బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందని,కార్మికుల సమ్మె హక్కు,కనీస వేతన హక్కు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులు కట్ చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో రైతు,కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సీఐటీయూ నాయకులు అన్నల్దాస్, గణేష్,ఐఎన్‌టియుసి నాయకురాలు గొట్టే రుక్మిణీ,బీఆర్ టియు నాయకులు వెంగల శ్రీనివాస్, బిఎఫ్ టియు నాయకులు చిట్యాల మధు తదితరులు పాల్గొన్నారు.

# నిదానంపాటి శ్రీలక్ష్మిఅమ్మ వారిని దర్శించుకున్న మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి



నాచారం(ప్రశ్న న్యూస్) గుంటూరు జిల్లా లో ఉన్న ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అడిగొప్పుల గ్రామంలో వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మిఅమ్మ వారి ఆలయాన్నీ మాజీ సైనికుడు శ్రీకాంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ సంతోష్ రెడ్డి దర్శించుకుని లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం దేవాలయ కమిటీ అధ్వర్యంలో సంతోష్ రెడ్డి, మంథని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముసుకుల లోకేందర్ రెడ్డి లని శాలువాతో సత్కరించి దేవాలయ విశిష్టత ను వివరించారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఎస్ ఎస్ యువసేన సభ్యులు విజయ్ రెడ్డి, సునీల్, శ్రీధర్ జాదవ్, ఆరెల్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి

కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కుల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా మరియు సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నిజంగా అవసరమైన ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, వారిని ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు లక్ష్యాల వారీగా నిర్దేశించుకొని అర్హుల ఎంపికను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సజావుగా సర్వే చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా..అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే సర్వే చేసిన వివరాల పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరిశీలన చేసే క్రమంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకూడదని, సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయడం జరుగుతుందని ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల వారీగా పరిశీలన పూర్తి కాగానే మొదటి విడత లో ఎంపిక చేసిన అర్హుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగహన కల్పించాలని అన్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- పవర్ యూత్ అధ్యక్షులు : దుద్దేటి రాకేష్
- పవర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులను పవర్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవర్ యూత్ అధ్యక్షులు దుద్దెటి రాకేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ ఇరువాల మల్లేశం, పర్శరాములు, ప్రశాంత్, అనిల్, పవర్ యూత్ సభ్యులు గౌతమ్, వివేక్, రాహూల్,అభి, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన బీజేపీ మండల అధ్యక్షులు పరమేష్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రక్తహీనతతో బాధపడుతున్న వ్యక్తికి సమయానికి రక్తం అందించి ప్రాణాలు కాపాడిన ఘటన వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వేములవాడ రూరల్ మండలానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి, బాధితుడి ప్రాణాలను రక్షించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ, "ఇప్పటివరకు 16 సార్లు రక్తదానం, రెండు సార్లు ప్లాస్మా దానం చేశాను. అవసరముంటే ఎప్పుడూ రక్తదానానికి సిద్ధంగా ఉంటాను," అని మీడియాతో తెలిపారు. ఆయన చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు, బీజేపీ కార్యకర్తలు ప్రశంసించారు.

# వంద కోట్లు కూడా

## భలే సులువు అయిపోయిందిగా..!



ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఇప్పుడు స్టార్ హీరోగా ఎదిగాడు నాని. ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన నాని ఇప్పుడు మీడియం టైర్ హీరోల నుండి స్టార్ హీరోల లిస్ట్‌లోకి చేరాడు. నాని కష్టంతో పాటు అదృష్టం కూడా తోడు కావడంతో ఇండస్ట్రీలో నిలబడ్డాడు. మంచి మంచి విజయాలు అందిపుచ్చుకుంటూ తన రేంజ్ పెంచుకుంటూ వెళ్లాడు. పదేళ్ల ముందు 'భలే భలే మగాడివోయ్'తో 50 కోట్ల వసూళ్ల మార్కును అందుకుంటే అందరూ ఆశ్చర్యపోయారు. ఇక ఇప్పుడు వంద కోట్ల మార్కుని అవలీలగా చేరుకున్న నాని విమర్శకుల నోళ్లు మూయించాడు. రెండేళ్ల కిందట 'దసరా' అనే సినిమాతో వంద కోట్ల మైలురాయిని అందుకున్న నాని ఇప్పుడు 'హిట్-3'తో మరోసారి ఆ మైల్‌స్టోన్‌ను అందుకోవడం జరిగింది. ఇక నానికి వంద కోట్ల మైలు రాయి అందుకోవడం పెద్ద కష్టమేమి కాదని హిట్ 3తో అర్థమైంది. నాని నటించిన సినిమాలే కాదు ఆయన నిర్మించిన చిత్రాలు కూడా బాక్సాఫీస్ దగ్గర పెద్ద విజయం సాధించి నాని స్థాయిని పెంచుతున్నాయి. నాని కెరీర్లో ఓపెనింగ్స్ పరంగా ట్రేడ్ వర్గాలను ఎక్కువ ఆశ్చర్యపరిచిన సినిమా అంటే.. 'ఎంసీఏ' చిత్రం అని చెప్పవచ్చు. నాని కెరీర్లో తొలి పూర్తి స్థాయి మాస్ సినిమాగా వచ్చిన ఈ చిత్రం 2017లోనే రూ.15 కోట్ల మేర ఓపెనింగ్స్ రాబట్టి నాని రేంజ్‌ను ఒక్కసారిగా పెంచింది. ఇక ఈ సినిమా తర్వాత నుండి నాని సినిమాలకి పది కోట్లు ఓపెనింగ్ కామన్ అయింది. దసరా చిత్రం అయితే ఏకంగా రూ. 38 కోట్ల ఓపెనింగ్స్ రాబట్టింది. ఇక రీసెంట్‌గా వచ్చిన హిట్ 3 చిత్రం కాస్త వయొలెంట్‌గా ఉన్నా కూడా ఇందులో హీరోయిజం ఓ రేంజ్‌లో ఉండడం, చిత్రం మాస్‌కు కనెక్ట్ కావడం, ప్రి రిలీజ్ హైప్ పీక్స్‌కు చేరుకోవడంతో ఓపెనింగ్స్ ఏకంగా రూ.43 కోట్ల వసూళ్లు వచ్చాయి. 'హిట్-3'తో సక్సెస్‌తో నాని నెక్ట్స్ చిత్రం 'ది ప్యారడైజ్'కు కూడా కావల్సినంత హైప్ వచ్చింది. ఇప్పుడు ది ప్యారడైజ్ చిత్రానికి రూ.50 కోట్ల ఓపెనింగ్ అన్నది ఈజీ టార్గెట్ అని చెప్పొచ్చు. ఏదేమైన నాని రేంజ్ సినిమా సినిమాకి పెరుగుతూ పోతుండడం విశేషం.

# ఈవెంట్‌లో సందడి చేయబోతున్న సమంత



అందాల ముద్దుగుమ్మ సమంత ఇటీవల సినిమాల స్పీడ్ తగ్గించింది. దీంతో జనాలతో ఇంటరాక్షన్ కూడా తగ్గింది. గతంలో అంటే మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్స్ లేదంటే సినిమా ప్రమోషన్స్ సమయంలో కనిపించి సందడి చేసేది. కాని ఇప్పుడు అలా లేదు. స్లో అండ్ స్టడీగా వెళుతుంది. స్టార్ హీరోయిన్ గా సూపర్ ఫామ్ లో ఉన్న టైంలోనే సడెన్ గా బ్రేక్ తీసుకున్నారు సమంత. హెల్త్ ఇష్యూ కారణంగా కెరియర్ లో లాంగ్ బ్రేక్ తీసుకోవడం, అదే సమయంలో ఓటీటీ ఆఫర్స్ రావడంతో సిల్వర్ స్క్రీన్ కు మరింత గ్యాప్ ఇచ్చారు చెన్నై చంద్రం. ఇక సమంత ఇప్పుడు నటి మాత్రమే కాదు నిర్మాత కూడా. ఓవైపు ఓటీటీ ప్రాజెక్ట్స్ లో నటిస్తూ , తను స్వయంగా నటించే సినిమాతోనే ప్రొడక్షన్ స్టార్ట్ చేయాలని భావించింది. కాని ఆ ప్రాజెక్ట్ డిలే కావడంతో శుభం అనే చిన్న సినిమాను ఆడియన్స్ ముందుకు తీసుకొస్తున్నారుట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఇందులో ప్రవీణ్ కాండ్రేగుల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రియ కొంతం, షాలిని కొండేపూడి.. పలువురు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో హారర్ కామెడీ సినిమాగా చిత్రాన్ని రూపొందించారు. మే 9న వరల్డ్ వైడ్‌గా విడుదల కానున్నఈ మూవీ ట్రైలర్ ఇప్పటికే విడుదల కాగా, దీనికి మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే మూవీ రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ స్పీడ్ పెంచింది. మే 4న వైజాగ్‌లోని ఆర్‌కే బీచ్‌లో సాయంత్రం 5 గంటల నుంచి ప్రీ రిలీజ్ ఈవెంట్ జరపనుంది.ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది.

ఈ ఈవెంట్‌కి సమంత హాజరు కానుందా, వస్తే తన సినిమాల గురించి ఏవైన అప్‌డేట్స్ ఇస్తుందా, ఎలాంటి ఆసక్తికర విషయాలు పంచుకోబోతుంది అని ఆమె అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే నిర్మాతగా సక్సెస్‌లు సాధించలేక చాలా మంది వెనకడుగు వేస్తున్న సమయంలో సమంత ఓ అడుగు ముందుకేసి నిర్మాతగా మారింది. లైఫ్ లో రిస్క్ తీసుకోకపోతే ముందుకు వెళ్ళలేమని చెబుతుంది. ఒకప్పుడు ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే భయపడేదాన్ని , ఇప్పుడు ఆ భయం లేదంటుంది.



## హిట్-3 గురించి అద్భుతమైన వార్తలు వింటున్నాను

# రామ్ చరణ్

నాని, శైలేష్ కొలను కాంబినేషన్ లో వచ్చిన హిట్-3 చిత్రం సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. మే 1న విడుదలైన ఈ చిత్రం నాని కెరీర్ లోనే భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'హిట్ 3' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా గురించి అద్భుతమైన సమీక్షలు వింటున్నానని వెల్లడించారు. చిత్ర బృందానికి తన అభినందనలు తెలియజేశారు. 'హిట్ 3' సినిమా అద్భుతమైన విజయం సాధించడం పట్ల రామ్ చరణ్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నా ఆత్మీయ సోదరుడు నాని విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, విభిన్న జానర్లలో బ్లాక్‌బస్టర్ విజయాలు సాధిస్తున్నాడంటూ కొనియాడారు. అంతేకాకుండా, ఈ ఉత్కంఠభరితమైన చిత్రాన్ని అద్భుతంగా రాసి, అంతే ప్రతిభావంతంగా తెరకెక్కించిన దర్శకుడు శైలేష్ కొలను పనితీరును కూడా రామ్ చరణ్ మెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వ ప్రతిభకు హ్యాట్సాఫ్ చెప్పారు.

ఈ చిత్ర విజయంలో భాగస్వాములైన నటి శ్రీనిధి శెట్టి, నిర్మాత ప్రశాంతి తిపిర్నేని, వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ బృందాలకు కూడా రామ్ చరణ్ తన శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ ఘన విజయం పట్ల మొత్తం చిత్ర బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.

## పొలిటికల్ ఎంట్రీపై నటుడు

# అజిత్ ఆసక్తికర వ్యాఖ్యలు

కోలీవుడ్ నటుడు అజిత్ కుమార్ రాజకీయాల్లోకి రావడంపై తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి 33 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజకీయాల్లోకి వస్తున్న సినీ నటీనటులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అయితే, వ్యక్తిగతంగా తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని అజిత్ స్పష్టం చేశారు. పాలిటిక్స్ అంటే తనకు ఆసక్తి లేదని తెలియజేశారు. ఇక, రాజకీయాల్లో మార్పు తీసుకురాగలమనే విశ్వాసంతో అడుగులు వేస్తున్న వారందరూ విజయం సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల కొత్త రాజకీయ పార్టీ స్థాపించి, రాజకీయాల్లోకి వచ్చిన తన మిత్రుడు, దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీని సాహసోపేతమైన నిర్ణయంగా అజిత్ పేర్కొన్నారు. కాగా, 140 కోట్ల జనాభా కలిగిన ఇండియాలో వివిధ మతాలు, జాతులు, భాషలు కలిగిన ప్రజలు సామరస్యంగా జీవించడం గొప్ప విషయమని అజిత్ కొనియాడారు. ఇంతటి వైవిధ్యాన్ని కలిగి ఉన్న దేశాన్ని ఏకతాటిపై నడిపించడం కేవలం రాజకీయ నాయకులకే సాధ్యమవుతుందన్నారు. ఇటీవలే అజిత్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తాను రాష్ట్రపతి భవన్‌ను సందర్శించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లు తనను ఆశ్చర్యానికి గురి చేశాయని ఆయన వెల్లడించారు. (దేశ నాయకులు తమ జీవితాలను ఎలా గడుపుతున్నారో అప్పుడే తనకు అర్థమైందని అజిత్ చెప్పారు. ఒక దేశాన్ని లేదా రాష్ట్రాన్ని బాధ్యతగా నడిపించడం చాలా కష్టమైన పని అని తాను అప్పుడు గ్రహించానన్నారు. అందుకే నటుడు విజయ్ పాలిటిక్స్‌లోకి రావడం సాహసోపేతమైన నిర్ణయమని ఆయన చెప్పుకొచ్చారు.



# తెలంగాణలో ఆర్థిక సంక్షోభం.?

## - హామీలు నెరవేర్చడం రేవంత్ కు సవాల్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రూ. 8.5 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు ఆరోపిస్తూ, ఈ అప్పుల భారమే ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి కారణమని పేర్కొంటున్నారు. రాష్ట్ర బడ్జెట్ను సమతుల్యం చేయడానికి రేవంత్ "పద్మనాభ స్వామి లెక్కలు" వేస్తున్నట్లు స్వయంగా సెటైర్ వేసుకున్నారు. అయితే, ఆర్థిక సంక్షోభం ఒక్క తెలంగాణకే పరిమితం కాదు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కూడా ఆదాయానికి మించిన ఖర్చులతో సతమతమవుతున్నాయి.

### - తెలంగాణ ఆర్థిక వ్యూహం..

తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు కంచె గచ్చిబౌలి భూములను బాండ్ల రూపంలో మార్చి రూ.10 వేల కోట్ల నిధులను సమీకరించింది. ఈ నిధులతో కొన్ని ఎన్నికల హామీలు మహాలక్ష్మి పథకం, రైతు భరోసా వంటివి నెరవేర్చినప్పటికీ, ఇంకా అనేక హామీలు నెరవేర్చాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం పరిమితంగా ఉండటం, అప్పుల సేవకు భారీ మొత్తం కేటాయించాల్సి రావడంతో కొత్త పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. రేవంత్ ఈ ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ, మునుపటి ప్రభుత్వం చేసిన అప్పులే ఈ పరిస్థితికి కారణమని వాదిస్తున్నారు.

### - జాలి కాదు, ఫలితాలే కావాలి

రేవంత్ రెడ్డి ఆర్థిక కష్టాలను వివరించినప్పటికీ, ప్రజలు ఈ "బీద రాగం"ను ఎంతవరకు ఒప్పుకుంటారనేది ప్రశ్న. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఉచిత పథకాలు, ఆర్థిక సాయం వంటి హామీలతో ప్రజలను ఆకర్షిస్తారు. తెలంగాణలోనూ గతంలో అమలైన రైతు బంధు, ఆసరా పెన్షన్ వంటి పథకాలు ప్రజలను ఉచిత సాయానికి అలవాటు చేశాయి. ఒకసారి రూ. 10 వేల సాయం అందిస్తే, తదుపరి రూ.20 వేల ఆశించే మనస్తత్వం ప్రజల్లో ఏర్పడింది. ఇప్పుడు "డబ్బులు లేవు" అనే వాదన ప్రజలను సంతృప్తి పరచడం కష్టం. ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకోమని కోరడం కంటే, హామీలను నెరవేర్చడంపైనే ప్రజలు దృష్టి పెడతారు.

### - సరైన ఖర్చు విధానం అవసరం

తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా బలమైన సామర్థ్యం కలిగిన రాష్ట్రం. హైదరాబాద్ వంటి ఆర్థిక కేంద్రం, ఐటీ రంగం, రియల్ ఎస్టేట్, వ్యవసాయ ఆదాయం రాష్ట్రానికి గణనీయమైన నిధులను అందిస్తాయి. అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర హామీలు, అప్పులపై ఆధారపడటం వల్ల ఈ సంపద సరిగా వినియోగించబడటం లేదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అవసరమైన పథకాలకు మాత్రమే నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తే తెలంగాణ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడవచ్చు. ఉదాహరణకు, రాష్ట్రంలో రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది.

### - సీఎంపై హామీల ఒత్తిడి..

రేవంత్రెడ్డి ఆర్థిక సంక్షోభాన్ని నిర్వహించడంలో రాజకీయ ఒత్తిడిని కూడా ఎదుర్కొంటున్నారు. ప్రజలు హామీల నెరవేర్పును ఆశిస్తుండగా, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. రాజకీయంగా జవాబుదారీగా ఉండాలనే ఒత్తిడితో, రేవంత్ తక్షణ ఫలితాలను ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడం అనివార్యం. ఉచిత పథకాలను పరిమితం చేసి, ఆదాయ వనరులను పెంచే విధానాలపై దృష్టి పెట్టడం ద్వారా ఈ సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

### - ప్రజలు ఏం కోరుకుంటున్నారు?

తెలంగాణ ప్రజలు రాజకీయ హామీల కంటే ఆచరణీయ ఫలితాలను ఆశిస్తున్నారు. ఉచిత పథకాలు తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్థిరత్వం వంటివి దీర్ఘకాలంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి. రేవంత్ రెడ్డి ఈ అంచనాలను అర్థం చేసుకొని, ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడానికి పారదర్శకమైన, ఆచరణీయ విధానాలను అమలు చేయాల్సి ఉంది. లేకపోతే, ప్రజల అసంతృప్తి రాజకీయంగా ప్రతిపక్షాలకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది.

# అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తాం: పొన్నం ప్రభాకర్

- కుటుంబ సభ్యులు పెరిగిన రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేస్తాం
- పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చారిత్రాత్మకమైన నిర్ణయం
- బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన మంత్రి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హిమాయత్ భారతదేశంలో మొదటి సారి ధనవంతుడు పేదవాడు అనే తేడా లేకుండా సన్న బియ్యం తినాలని తెలంగాణ ప్రభుత్వం ఉగాది పండగ నుండి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ హిమాయత్ నగర్ ఆదర్శ బస్తీలో పౌరసరఫరాల దుకాణం 602 లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ లో ఎన్నికల కోడ్ వల్ల సన్న బియ్యం పంపిణీ చేయలేక పోయినామని అన్నారు. ఈ నెల 1వ తేదీ నుండి హైదరాబాద్ జిల్లా లోని 653 రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించడం జరిగిందన్నారు.సన్న బియ్యం కార్యక్రమంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని,గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదు, రేషన్ కార్డుల్లో మార్పులు చేయలేదన్నారు.తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వే ,ప్రజా వాణి అప్లికేషన్ , రెగ్యులర్ గా ఎమ్మార్వో ఆఫీస్ ల నుండి వచ్చిన అప్లికేషన్ ల ద్వారా రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుందన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని బయట సన్న బియ్యం మార్కెట్ లో 60 రూపాయలకు కేజీ బియ్యం ఉన్నాయని తెలిపారు. ఈ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడనుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500 కి గ్యాస్,సన్న వడ్లకు వరికి 500 బోనస్,65 వేల ఉద్యోగాలు భర్తీచేశామని తెలిపారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధిపై ముందుకు వెళ్తాం అని,హైదరాబాద్ ప్రజలు ఈ సన్న బియ్యం పథకాన్ని ఉపయోగించుకొని ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించగలన్నారు.ఇందిరమ్మ ఇళ్లు , రేషన్ కార్డులు , రాజీవ్‌యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి నారాయణ గూడ గాంధీ కుటీర్ వద్ద సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కార్పొరేటర్లు విజయ రెడ్డి, మహ లక్ష్మి, అధికారులతో కలిసి భోజనం చేయడం జరిగింది ఈ సందర్భంగా సన్న బియ్యం లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# దంచికొడుతున్న ఎండలు

## ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి

- అడుగంటిన భూగర్భజలాలు తప్పని నీటి కష్టాలు
- భయటకు వెళ్లేందుకు జంకుతున్న జనాలు - అప్రమత్తత తప్పనిసరి అంటున్న వైద్యులు

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** భానుడి భగభగలతో జనం విలవిలలాడుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వేడిగాలులు, ఉక్కపోతలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండవేడిని తట్టుకోలేక జనం భయటకు వెళ్ళేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం అయితే చాలు ఎప్పుడు రద్దీగా ఉండే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6:30 గంటల వరకు ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు ఇండ్ల నుండి భయటకు వెళ్ళాలంటే భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే భయటకు వెళ్తున్నారు. ఎండదెబ్బ తగులకుండా ఉండేందుకు రక్షణ చర్యలు పాటిస్తున్నారు. మే నెలలో ఎండల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు నిపుణులు తెలుపుతున్నారు. ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు ప్రజలు జాగ్రతలు తీసుకోవాలని వెద్యులు సూచిస్తున్నారు.

### విపరీతంగా కొడుతున్న ఎండలు

వేసవి వచ్చిందంటే చాలు మేడ్చల్ మండలంలోని ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో అతలాకుతలమవుతారు. గతంతో పోలిస్తే ఈ సారి ఆరంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో జనం విలవిలలాడిపోతున్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6:30 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో భయటకు వెళ్లాలంటే ఎండ దాటికి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో భయటకు వెళ్లాలంటే ఎండ దాటికి తట్టుకోలేక జంకాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో ఆ సమయంలో రహదారులన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందేందుకు చల్లదనాన్ని ఇచ్చే శీతల పానీయాలు, పండ్ల రసాలను తీసుకొని ఉపశమనం పొందుతున్నారు. ఎండదెబ్బ తగులకుండా తలకు రక్షణగా టోపీలను, రుమాళ్లను



చుట్టుకొని, గొడుగులను పట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొబ్బరి బోండాలను, నిమ్మసోడా, చెరుకు, పండ్ల రసాలను ఎక్కువగా తాగుతూ ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

### తప్పని నీటి కష్టాలు

వేసవి ఆరంభం నుంచి ఎండలు మండుతున్నాయి. ఈ సారి భూగర్భ జలాలు అడుగంటడంతో నీటిమట్టం తగ్గిపోయింది. బోర్లు నీళ్లు పోసే సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేకపోవడంతో పశువులు దాహం తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.

### ఊపందుకున్న సీజనల్ వ్యాపారాలు

సీజనల్ వ్యాపారాలు ఊపందుకున్నాయి. జ్యూస్ స్టాల్స్, వివిధ రకాల పండ్ల రసాలు, శీతల పానీయాలు, టోపీలు, గొడుగులు వంటి వ్యాపారాలకి గిరాకీ పెరిగింది. తాగునీటి కోసం ఉపయోగించే మట్టి కుండలు అమ్మకాలు జోరందుకున్నాయి. వేసవి తాపాన్ని తగ్గించేటువంటి కూలర్లు, ఏసీల కొనుగోళ్లు పెరుగుతున్నాయి.

### అప్రమత్తత తప్పనిసరి



1. ఎండవేడిమి, వేడిగాలుల వల్ల ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి.
2. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు భయటకు వెళ్లకపోవడం మంచిది.
3. తప్పని సరిగా వెళ్లాల్సి వస్తే తలకు రక్షణగా టోపీలను, రుమాళ్ళను ధరించాలి.
4. నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, వాటర్ మిలన్, ఆరెంజ్, గ్రేప్స్ ఎక్కువగా తీసుకోవాలి. అవి శరీరంలో ఉన్న మినరల్స్ ను తగ్గకుండా చేస్తుంది.
5. ఫ్రీడ్జ్ వాటర్, థంప్సప్, కోక్ లాంటి శీతల పానీయాలు చల్లగా ఉన్నాయని తాగరాదు.
6. ముందుజాగ్రత్త చర్యలుగా ఓఆర్ఎస్ తాగాలి.
7. ఎండదెబ్బ తగిలితే తల తిరగడం అలసట, విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి.
8. అలాంటి సమయంలో లక్షణాలను గమనించి ఎండదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడలో కూర్చోబెట్టి శరీరమంతా తడిగుడ్డతో తుడవాలి. ఆ తరువాత దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి.
9. నల్లటి బట్టలను ధరించకుండా వదులుగా ఉండే బట్టలను ధరించాలి.
10. వేడిగాలులతో రాత్రి వేళలో ఎండదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
11. ఎండదెబ్బ తగలడంతో కొందరు నిద్రలోనే చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. కాబట్టి వేసవిలో ఎండవేడిమి తగలకుండా తగు రక్షణ చర్యలు పాటించాలి

# బంజార హిల్స్‌లో స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజల కు వినియోగిస్తాం

- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం
- కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న జిల్లా కలెక్టర్ కు అభినందించిన మంత్రి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు కబ్జా కు గురై తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజల ఉపయోగార్థం వినియోగించినున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ , జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ,ఆర్డీవో ,ఎమ్మార్వో తదితర అధికారులలతో కలసి బంజార బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు 102/1 సర్వ్ నెంబర్ లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం కబ్జాకి గురికావడంతో కలెక్టర్ ,ఆర్డీవో ఎమ్మార్వో తదితర అధికారులు రికార్డుల ఆధారంగా రెవెన్యూ అధీనంలోకి తీసుకోవడం జరిగింది.1200 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో కి హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే ప్రజలు ప్రభుత్వా దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. బంజారాహిల్స్ సర్వే నంబర్102/1 లో స్వాధీనం చేసుకున్న భూమినిప్రజలకు ఉపయోగపడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం చేశారాని తెలిపారు.ధరణి తరువాత భూ భారతి వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు కబ్జా కు గురైనట్లయితే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, షేక్పేట్ తాసిల్దార్ అనిత రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 2వ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ప్రారంభం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** హైదరాబాద్‌లో రెండో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ౮- 2025 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి ఎక్స్‌పోను ప్రారంభించారు. తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన విద్యా ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్ కోసం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పీసీసీ చీఫ్ తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. వెనకబడిన మైనార్టీ విద్యార్థులను ఆదుకోవడంలో ముస్లిం ఉన్నత వర్గాలు ముందుకు రావాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో %ూఞూజ ౮ ౡూజజ% కన్వీనర్ ఇర్ఫాన్ అజీజ్, యూనిసెఫ్ చీఫ్ డాక్టర్ జీలేలం టాఫెస్సే, షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ అబ్దుల్ ఖాదీర్, విద్యానికేతన్ పాఠశాలల అధినేత జునైద్ బహెల్మి, శ్రీమతి జీనత్ ఇక్బాల్, ప్రొఫెసర్ రెహాన్ సూరి, ఐజాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బీజేపీ కార్పొరేటర్‌పై కేసు నమోదు

## - అధికారిపై చేయి చేసుకున్న కార్పొరేటర్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారిపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై బీజేపీ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌పై కేసు నమోదైంది. నగరంలోని అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన సెక్షన్ అధికారి తన విధి నిర్వహణలో ఉండగా, కార్పొరేటర్ ఆయనపై దాడి చేశారని ఫిర్యాదు అందింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడం (బీఎన్ఎస్ సెక్షన్ 132), దాడికి పాల్పడటం (బీఎన్ఎస్ సెక్షన్ 352) వంటి అభియోగాల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ సంఘటనపై జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తీవ్రంగా స్పందించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను కమిషనర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసిన విషయాన్ని అబిడ్స్ పోలీసులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు తెలియజేశారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588